# విలువలు

ఆ రోజు మహా శివరాత్రి. పదిహేనూ, ఇరవై మైళ్ల పరిధిలో ఉన్న గ్రామాల నుండి జనం వచ్చి ఆ పట్నం చేరుకున్నారు. ఆ పట్టణంలో ఉన్న ప్రధాన వీధుల్లోనూ, క్రాస్‌రోడ్లలోనూ ఎన్నో ప్రోగ్రాములు! తెల్లవార్లూ సినిమా ఆటలు! అటూ, ఇటూ తిరుగాడుతూ ఇసుకవేస్తే రాలనంత జనం! మెయిన్ రోడ్డులో జన ప్రవాహం కట్టలు తెంచుకుని పారుతూంది. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాడు చేయబడింది. అందుకే కాబోలు స్త్రీలూ, పిల్లలూకూడా ధైర్యంగా తిరుగుతున్నారు.

రాత్రి తొమ్మిది గంటలైంది అది టూటౌన్ పోలీస్ స్టేషన్. బయట వరండా మీద ఉన్న పొడుగాటి బల్లమీద కూర్చుని గోడకు జారబడి కునుకుపాట్లు పడుతున్నాడు హెడ్‌కానిస్టేబులు వెంకటస్వామి. స్టేషన్‌లో ఎవరూ లేరు. అతను తప్పించి. మెయిన్ గేటు దగ్గరున్న కుంకుడు చెట్టు కింద నిలబడి బీడి కాల్చుకుంటున్నాడు. సెంట్రీ శంకర్రావు. మెయిన్ రోడ్డుమీద తిరుగుతూన్న జనాన్ని చూస్తున్నాడు వేడుగ్గా.

మూడు రోజుల క్రితం ఒక దోపిడీ కేసుకు సంబంధించిన ఫైల్సు తీసుకుని సర్కిలినస్పెక్టరు గారితో హైద్రాబాద్ వెళ్ళి ఆ రోజు సాయంత్రమే తిరిగి వచ్చాడు వెంకటస్వామి. పగలల్లా ప్రయాణం. అంతకు ముందు రోజు సరిగా నిద్రలేదు. బడలికగా ఉంది. నిద్ర ముంచు కొస్తూంది. స్టేషనుకి రాగానే ఎస్సైయిగారితో చెప్పి సెలవు తీసుకుని ఇంటికి పోవాలనుకున్నాడు.

"సార్! నేవస్తా సార్! గత రాత్రంతా నిద్ర లేదు! ఈ రోజంతా ప్రయాణం!" అన్నాడు ఆయన అనుమతి కోసం.

"అవును! హైదరాబాద్ వెళ్ళి వచ్చావు కదూ!" అని ఆగి ....

"ఈ రోజు రాత్రంతా గట్టి బందోబస్తుండాలన్నారు ఎస్పీ దొరగారు! అందర్నీ

డ్యూటీకి తీసుకొచ్చాం! పక్కనున్న స్టేషన్‌ల నుండి కూడా తెప్పించాం" అని ఎస్సయిగారు అనడంతో దిగాలు పడ్డాడు వెంకటస్వామి. ఇబ్బందిగా మొహం పెట్టాడు. దీనంగా చూశాడు. అతని పరిస్థితి చూసి కొంత కన్సిడరేషన్ ఇచ్చారు ఎస్సయిగారు.

"సరే! ఒక పని చెయ్!" అన్నారు.

"ఎస్సార్!" అందుకున్నాడు వెంకటస్వామి హుషారుగా.

"పదకొండు గంటల దాకా అలా టౌనంతా తిరిగి ఆ తరవాత ఇంటి వెళ్లు!" అన్నాడు.

"థాంక్యూ సార్!" అంటూ చేతిలోని సంచీని గోడలో ఉన్న అల్మెరాలో పెట్టాడు వెంకటస్వామి. వరండాలో ఉన్న బల్లమీద కూర్చుని కునుకుపాట్లు పడసాగాడు, ఎస్సయిగారు బయటకు ఎప్పుడు వెళ్ళింది తెలీదతనికి.

టౌనులో అంతవరకూ తిరిగి స్టేషన్ చేరుకున్నాడు మరో హెడ్ కానిస్టేబుల్ కరీంబాయ్.

"ఏంటీ, ఎంకట్సాంబయ్యా, కూకునే కునుకూ తీస్తుండావ్!" పలకరించాడు వెంకటస్వామిని. అతను పలక్క పోవడంతో భుజం మీద చేయి వేశాడు కరీం.

"నిద్రా పోతున్నావ్? జరా జర్గు బయ్యా!" కొద్దిగా జరిగి కరీంకి జాగా ఇచ్చాడు వెంకటస్వామి. అతన్ని మాటల్లోకి దింపాలనుకున్నాడు కరీం కాలక్షేపం కోసం.

"మీకీ ఈ దినం పండ్గా అని అంతా జాగిలం చేస్తుండార్! మీది జనం! నీకి నిద్రా ఎట్లా వస్తుంది బయ్యా!"

నిద్రాభంగం అయినందుకూ, పైగా అతని మాటలకీ చీకాకు వేసింది వెంకటస్వామికి.

"జాగిలాలూ, వూరకుక్కలూ కాదయ్యా! జాగారం! జాగారం చేస్తారు!" సరిదిద్దబోయాడు. ఒకసారి ఆఫీసు గదిలోకి వంగి చూశాడు కరీం. సీఅయ్‌గారు కానీ, ఎస్సై గారు కానీ లేకపోవడంతో నెమ్మదిగా అన్నాడు. "ఎస్సై గార్కి చెప్పి ఇంట్కి జావ్!" మాట్లాడలేదు వెంకటస్వామి. లేచి నిలబడ్డాడు. టైమ్ చూసుకున్నాడు.

తొమ్మిది గంటలైంది ఎస్సైగారి ఆజ్ఞ ప్రకారం ఇంకా రెండు గంటలుండాలి. దగ్గరలోనే ఉన్న జంక్షన్‌లోకి పోయి టీ తాగాడు. సిగరెట్టు వెలిగించాడు. ఎటు చూసినా జనం! ఒకరి నొకరు రాసుకుంటూ తిరుగుతున్నారు. సినీమా జనంకూడా కలవడంతో మరీ ఇబ్బంది అయింది. సైకిళ్ళూ, రిక్షాలు, టాక్సీలూ, కార్లూ, మోటారు సైకిళ్ళూ! హారన్లతో మారు మోగుతుంది. ట్రాఫిక్‌ని కంట్రోలు చేయలేక నానా అవస్థలూ పడుతున్నారు కానిస్టేబుల్సూ, ఎస్సయిలూ, సిఅయిలూ.

వెంకటస్వామిది ఎక్స్-రే కళ్ళు! అతను ఒకవైపే చూస్తున్నట్లు కనిపిస్తాడు. కాని లైట్‌హౌస్‌లో లైట్‌లా ఆతని దృష్టి నలువైపులా నలుగురి వైపూ పడుతుంది. వెంకటస్వామి పద్దెనిమిదేళ్ళ క్రితం ఉద్యోగంలో చేరాడు. హెడ్ కానిస్టేబుల్ హోదాకి మించి ఎదగ లేకపోయాడు. అతనితోనే సర్వీసులో చేరిన కనకారావు, యాదగిరీ ఎస్సైలు అయిపోయారు. హోదా పెంచుకోలేక పోయినా ఆస్తి పాస్తులు మాత్రం బాగా పెంచుకోగలిగాడు వెంకటస్వామి. చవక రోజుల్లో పది సంవత్సరాల క్రితం పట్టణానికి చివర చిన్న జాగా కొని మేడ కట్టించాడు. టౌనంతా అటువైపే బాగా పెరిగింది. ఆ ప్రాంతం ఒక పెద్ద జంక్షన్ అయింది. ఆ ఇంటికి అద్దె ఆరు వందలు వస్తూంది. దాని విలువ లక్ష రూపాయలు ఎదిగింది.

"అన్యాయపు అర్జన మన కొద్దు, మావాఁ! అందరూ తిట్టుకుంటారు! అమాయకులకు అన్యాయం జరిగితే మనల్ని శపిస్తారు! ఆ శాపాలే మనకి తగులుతున్నాయ్! పెద్దబ్బాయి అవిటోడు అయిపోయాడు! పెళ్ళయిన ఏడాదికే పసుపు కుంకుమల్ని పోగొట్టుని ఆడపిల్ల తిరిగొచ్చింది!" అని తరచూ మొత్తుకుని ఏడుస్తూ ఉంటుంది వెంకటస్వామి భార్య గౌరి.

ఎప్పుడైనా ఏకాకిగా ఉన్నప్పుడు ఆలోచిస్తాడు వెంకటస్వామి. అతని దృష్టిలో గౌరి ఒట్టి అమాయకురాలు - వెర్రిబాగులది! లేకపోతే సిరి రా మోచేయి అడ్డు పెడుతుందా? తన ఆర్జనకీ, పెద్దబ్బాయికి పోలియో రావడానికీ, అల్లుడు చనిపోవడానికీ ఏమిటి సంబంధం? రెండు చేతులా సంపాదించుకున్నాడు కాబట్టే వేలకు వేలు ఖర్చు చేసి కొడుకుని రాయవెల్లూరు తీసుకెళ్ళి వైద్యం చేయించగలిగాడు. వాడి దురదృష్టం! కాళ్ళు రాలేదు! మంచి యోగ్యుడైన ఉద్యోగం చేస్తూన్న కుర్రాణ్ణి పదివేలు కట్నం ఇచ్చి అల్లుడిగా తెచ్చుకున్నాడు. అల్పాయుష్కుడని ఎవరికి తెలుసు?

అమ్మాయి రాత అలా ఉంది. ఇరవై నిండకుండానే పసుపూ, కుంకుమా నిండుకుంది. ఆ రోజుల్లో కాబట్టి సంపాదించుకోగలిగాడు ప్రస్తుతం రోజులు మారాయి. కొత్తగా వచ్చిన సిఐగారు, ఎస్సైగారూ డైరెక్టు రిక్రూటీలు! చాలా స్ట్రిక్టు! నీతి, నియమం, ధర్మం, న్యాయం అంటారు! వాళ్ళు తినరు, కింది వాళ్ళని తిననీరు! అయినా అలవాటు పోక చాటు మాటుగా చిలక్కొట్లు తింటూ ఉంటాడు వెంకటస్వామి.

మరోసారి టైమ్ చూసుకున్నాడు వెంకటస్వామి. తొమ్మిదిన్నరైంది. మెయిన్ రోడ్డు లోంచి నడక సాగించాడు. అక్కడ రోడ్డు వెడల్పు చాలా తక్కువ. ట్రాఫిక్ జామైంది. అక్కడే ఒక సినిమా హాలు ఉంది! ఆట వదిలారు. అటు నుంచి ఒక టాక్సీ, ఇటు నుంచి కారులూ! రోడ్డు మధ్యలో ఆగిపోయాయి. జనం వాటిని తప్పించుకుని రాలేక అవస్థలు పడుతున్నారు. అటునుంచి వచ్చిన కారు వైపు చూసాడు వెంకటస్వామి. అది టాక్సీ! వన్‌వే ట్రాఫిక్ కాబట్టి ఆ టాక్సీ అటునుంచి రాకూడదు.

వన్‌వే ట్రాఫిక్ అమలులో ఉన్నా కొంతమంది టాక్సీ డ్రైవర్లు ఆ నిబంధనని ఉల్లంఘిస్తూ ఉంటారు. అప్పుడప్పుడు కేసులు పెట్టినా వాళ్ళవని మానరు. ప్రతిసారి కేసులు రాయడం జరిగేపనికాదు. అందుకు అనేక కారణాలు! మొహమాటాలూ మామూళ్ళు వగైరా! ట్రాఫిక్‌ని కంట్రోల్ చేసి, వాళ్ళని మందలించి వదిలేస్తూ ఉంటారు.

"ముందు జంక్షన్‌లో కానిస్టేబుల్ లేదా? వీడెలా వచ్చాడు?" అనుకుంటూ గబగబా అడుగులు వేశాడు వెంకటస్వామి. టాక్సీ సమీపించి చూశాడు. దానిలో పాసెంజర్లు లేరు. దాని డ్రైవర్ ఓబులేసు!

"ఇలా ఎందు కొచ్చావ్?" కళ్ళురిమాడు వెంకటస్వామి లాఠీ వూపుతూ. బెదిరి పోలేదు ఓబులేసు. అయినా నెమ్మదిగా సమాధానం ఇచ్చాడు.

"కాద్సార్! ఈ పక్క సందులోంచి బంకుకి పోతా! ఆయిల్ కొట్టించుకుని అర్జంటుగా వెళ్ళాలి! బేరం తగిలింది!"

టాక్సీ డోరు తెరిచి ముందు సీట్లో ఓబులేసు పక్కనే కూర్చున్నాడు వెంకటస్వామి. ఠీవిగా అజ్ఞాపించాడు.

"సరే! పోనియ్!"

టాక్సీ పక్క సందులోంచి రెండో రోడ్డులోకి పోనిచ్చాడు ఓబులేసు. పెట్రోలు బంక్ చేరాలంటే ఒక మైలు పోవాలి. జనాన్ని తప్పించుకుంటూ నెమ్మదిగా వెళుతోంది

టాక్సీ. కొంత దూరం వెళ్ళాక జనసమ్మర్ధం తగ్గింది.

"కారాపు!" అన్నాడు అధికార స్వరంతో వెంకటస్వామి. రోడ్డు ప్రక్కగా కారాగింది. లైటు వేశాడు ఓబులేసు.

"ఇంతర్ధరాత్రప్పుడు శివరాత్రి పూటా నీకు బేరం తగిలింది? ఎక్కడికి వెళ్ళాలి?"

అనుమానంగా చూస్తూ గద్దించాడు వెంకటస్వామి. అయినా మామూలుగా, తేలిగ్గా సమాధానం ఇచ్చాడు ఓబులేసు.

"మీ కంత అనుమానవేఁ సార్! మా టాక్సీ డ్రైవర్లంటే నీతి నియమాలు లేని వాళ్లనీ దొంగలకు, స్మగ్లర్లకు సాయపడేవాళ్ళనీ మీ అభిప్రాయంలా ఉంద్సార్" అన్నాడు నవ్వుమొహంతో.

"ఎక్కడికి వెళ్ళాలి అని అడుగుతున్నా! అని హెడ్‌గారు సీరియస్‌గా అడగడంతో తానూ జాగ్రత్తగా మాట్లాడటం మెదలు పెట్టాడు ఓబులేసు.

"చెప్పాను కద్సార్! అర్జంటుగా బేరం తగిలిందని! క్రిష్టాపురం వెళ్ళి పేషెంటుని అర్జంటుగా ఆస్పత్రికి తీసుకురావాలి! ఎనభై రూపాయలకి ఒప్పుకున్నా! ఆయిలు పోయించుకొని అర్జంటుగా పోవాలి!"

వెంకటస్వామి మాట్లాడలేదు. ఆలోచనలో పడ్డాడు.

అయితే వీడి దగ్గర ఇప్పుడు ఎనభై రూపాయలున్నాయన్న మాట! ఆ మధ్య డ్యూటీకి రావడానికి క్రిష్టాపురం జంక్షన్‌లో రోడ్డు మీద నిలబడ్డాను. ఏ బస్సూ రాలేదు! వీడి టాక్సీ వచ్చింది. ఆపమని సైగ జేస్తే ఆపకుండా నిర్లక్ష్యంగా వచ్చేశాడు.

ఆ రోజు డ్యూటీకి రెండు గంటలు లేటుగా వచ్చినందుకు నానా చీవాట్లూ తినాల్సి వచ్చింది. తనంటే ఎంత నిర్లక్ష్యం వీడికి! దొరికాడు! వీడి పని పట్టాలి!" అనుకున్నాడు.

"ఎక్కడికి వెళ్లాలంటావ్ ?" అడిగాడు వెంకటస్వామి.

"క్రిష్టాపురం పోవాల్సార్! పేషెంటుని అర్జంటుగా హాస్పిటలుకు తీసుకు రావాలి! ఎవరో అబ్బాయి బుల్లెట్ మీద వచ్చి డబ్బిచ్చి వెళ్లాడు! అతని వెనకనే ఆయిలు కొట్టించుకుని పావుగంటలో వస్తానని చెప్పాను!" చెప్పాడు ఓబులేసు.

కిసుక్కున నవ్వాడు వెంకటస్వామి.

"ఓయ్! నీ కొత్తూరు కబుర్లు చెప్పకు! పేషెంటుని తీసుకురావడానికి క్రిష్టాపురం వెళుతున్నావో, కొత్తూరు నుంచి కాపుసారా డబ్బాలు తేవడానికి వెళుతున్నావో నాకు తెలీదనుకుంటున్నావా?"

అతని మాటలకి విలవిల్లాడాడు ఓబులేసు.

"లేద్సార్! అలాంటి పనులు చేస్తే మా షావుకారు ఒప్పుకోడు!"

"మరైతే మీ స్టాండు దగ్గరున్న బంకు దగ్గర మానేసి వూరి చివర బంకుకి ఎందుకు పోతున్నావ్? ఈ ట్రిప్పు ఎవడికీ తెలీకుండా ఉండాలనే కదా!"

"ఆ బంక్‌లో ఆయిలు లేదన్నారు, సార్! అందుకే అంత దూరం వెళ్లాల్సి వచ్చింది! అంతేకానీ మీ రనుకున్నట్లు సారా రవాణాకి కాదు, సార్! పేషెంటుకి చాలా సీరియస్‌గా ఉందని చెప్పాడు ఆ అబ్బాయి. అయిలు లేదంటే కిరాయంతా ముందుగానే ఇచ్చివేశాడు నామీద నమ్మకం కొద్దీ! అ భగవంతుని మీది ఒట్టు, సార్!"

ముందున్న కృష్ణుణి ఫోటో చూపిస్తూ ఒట్టు వేసుకున్నాడు ఓబులేసు. అయినా వెంకటస్వామి నమ్మకం కలగలేదు. ఆ ఫోటోని చూసి గలగలా నవ్వాడు.

అది బాలకృష్ణుని ఫోటో !

"ఆ కృష్ణమూర్తి కాండక్టు నీకు తెల్దుగావాల! ఆ డో ఫోర్‌టాన్టీ! చిన్నతనంలోనే ఆబద్దాలు మొదలు పెట్టాడు. ఆ తరువాత దొంగతనాలు ప్రారంభించాడు. ఆ తరవాత ఎన్నో మర్డర్లు చేశాడు-చేయించాడు! ఆ డో పెద్ద క్రిమినల్! ఆ మహానుభావుడి మీద కేసులన్నీ సెక్షన్ త్రీనాట్పూలే! యుద్ధంలో అర్జునుడు 'నేను యుద్ధం చేసి ఇంతమంది జనాన్నా చంపను మొర్రో!" అని అంటే ఈ కృష్ణుడు

ఏంటన్నాడో తెలుసా? 'ఓరి పిచ్చి సన్నాసీ! నీకు నీ రాజ్యం తిరిగి రావాలంటే ఈళ్ళందరి పుచ్చులూ ఎగర గొట్టేయ్! నీకు పాపం రాదు! అ కేసులన్నీ నేను చూసుకుంటా!' అన్నాడు. అలాంటి పెద్ద క్రిమినల్ మీదనా నీవు ఒట్టేసుకుంటున్నావ్! అడి కేరక్టర్ కూడా బహుచెడ్డది! ఆ విషయం తెలుసా నీకు?" వేళాకోళంగా పళ్ళికిలించాడు వెంకటస్వామి.

అతని గారపళ్ళు చూస్తుంటే ఓబులేసుకి అసహ్యం వేసింది.

"ఇప్పటికే చాలా అలస్యం అయింది! దయచేసి నన్నొదలండ్సార్! అవతల పేషెంటుకి చాలా సీరియస్‌గా వుంది!" బతిమాలాడు. వెంకటస్వామి కారు దిగలేదు.

"నమ్మమంటావా" అనుమానంగా అడిగాడు హెడ్.

"కావలిస్తే చూడండ్సార్! ఎనబై రూపాయలు ఇచ్చి వెళ్ళాడు!" జేబులోంచి డబ్బు బయటకు తీసి చూపించాడు ఓబులేసు.

వెంకటస్వామి కళ్ళు జిగేలుమన్నాయి! సంవత్సరం నుంచీ- అంటే ఆ స్టేషన్‌కి కొత్త సిఐ, ఎస్సైగార్లు వచ్చిన దగ్గర నుంచీ అతని చేతులు కట్టుబడిపోయాయ్. తెలిస్తే కొంప మునుగుతుంది. అయినా అలవాటు తప్పించుకోలేక అక్కడక్కడ కక్కుర్తి పడుతూనే ఉంటాడు. భయంగానే పులిపంజా లాంటి తన అరచేతిని ముందుకి విసిరి ఆ డబ్బును లాక్కున్నాడు. కంగారు పడ్డాడు ఓబులేసు. అనాలోచితంగా అతణ్ణి నమ్మించడం కోసం డబ్బు చూపించాడు. ఎట్టి పరిస్థితుల్లోను తమ దగ్గర డబ్బున్నట్లు పోలీసోళ్ళకి తెలియనీయకూడదు అన్న టాక్సీ డ్రైవర్ల సూక్తిని అ క్షణంలో మరిచాడు. వెంకటస్వామి కారు డోరు తెరిచి దిగాడు. అతని వెనకనే తానూ కారు దిగాడు ఓబులేసు.

"అవతల పేషెంటు ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు. సార్! వెళ్ళకపోతే పెద్ద గొడవుద్ది! మాట తినాల్సివస్తుంది. ఆడి ప్రాణం పోతే నా ప్రాణం తీస్తారు. మా డ్రయివర్లంతా నన్ను తిడతారు! డబ్బిప్పించండి, సార్!" ప్రాధేయపడ్డాడు.

"ఓస్! మీ దయివర్ల మాటలకి విలువకూడా ఉందంటావా? మీ సంగతి నాకు తెల్దూ! ఎక్కేటప్పుడు ఎనబై అంటారు. దిగేటప్పుడు వంద గుంజుతారు!"

అని ఎగతాళిగా తమనీ, తమ వృత్తినీ కించ పరుస్తుంటే సహించ లేకపోయాడు ఓబులేసు. పెల్లుబికిన ఆగ్రహాన్ని అతి కష్టం మీద అణుచుకున్నాడు. నిగ్రహించుకున్నాడు.

"ఎక్కడో ఒక పోలీసు లంచం తీసుకున్నాడని పోలీసోళ్ళందరూ అలాంటి వారేనని అంటే...." ఓబులేసు మాటలు పూర్తి కాలేదు.

"షటప్!" ఉగ్రుడయ్యాడు వెంకటస్వామి.

ఆవేశపడ్డాడు ఓబులేసు.

"అదేమాట నేను పైకి అనలేను, సార్! కారణం తెలుసా? మీరు యూనిఫారంలో ఉన్నారు! మీ యూనిఫారాన్ని మన్నించాలి! మీ టోపిని గౌరవించాలి!"

కార్యసాధకుడైన వెంకటస్వామి అతని మాటల్ని పట్టించుకోలేదు. ముందుకు నడిచాడు వెనక్కి తిరిగి చూడకుండా. నిస్సహాయంగా నిలబడి పోయాడు ఓబులేసు.

మూడు రోజుల నుంచీ కాని కళ్ళ చూడలేదు వెంకటస్వామి. ఆ రోజు మంచి బేరమే తగిలింది. దాని మీద మరో పాతిక రూపాయలు వేసి గౌరికి కొత్తమావాస్యకి చీర కొనాలని అనుకున్నాడు.

వెంకటస్వామి తిరిగి స్టేషన్ చేరుకునేసరికి రాత్రి పదకొండు గంటలైంది. ఎస్సైగారిచ్చిన పర్మిషన్ ప్రకారం ఇంటికి పోవచ్చు. స్టేషన్‌లో కరీంబాయ్ ఉన్నాడు. అల్మెరాలో ఉంచిన సంచిని తీసుకున్నాడు. ఇంటికి పోతూన్నట్లు కరీంబాయితో చెప్పి బయలుదేరాడు.

క్వార్టర్సు చేరుకునే సరికి ఇంటికి తాళం వేసి ఉంది. పక్కింటి వాళ్ళు చెప్పారు–కలకత్తా నుండి గౌరి అక్క బావా వచ్చారనీ. మూడు రోజులే ఉండి వెళుతున్నట్లు కబురు పంపారట. గౌరిని పిల్లలతో రమ్మని కబురు పంపారట. పిల్లల్ని తీసుకుని పుట్టింటికి క్రిష్ణాపురం వెళ్ళిందిట. తనుకూడా క్రిష్ణాపురం వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. ఆ గ్రామం జి.టి. రోడ్డుకి అనుకునే ఉంది. ఏ లారీలోనైనా పోవచ్చు. చేతిలో సంచీతో తిరిగి నాలుగు రోడ్ల జంక్షన్ చేరుకున్నాడు. లారీ కోసం నిరీక్షిస్తున్నాడు. అదృష్టవశాత్తు వెంటనే ఒక లారీ వచ్చింది. ఎక్కాడు. అత్తవారి

వూరు పది మైళ్ళు దూరంలోనే ఉంది. పన్నెండున్నర కల్లా ఆ వూరు చేరుకున్నాడు.

లారీ దిగి అత్తవారింటి వైపు నడక సాగించాడు. ఆ ఇంట్లో లైట్లు వెలిగి ఉన్నాయ్. ఇద్దరు మనుషులు వీధి అరుగు మీద కూర్చుని ఉన్నారు. దూరం నుంచి చూశాడు వెంకటస్వామి. అర్ధరాత్రయినా ఇంకాలైట్లు వెలిగి ఉన్నాయ్ ఏమిటి కారణం? అనుమానం! భయం ముంచుకొచ్చాయ్. గబగబా అడుగులు వేశాడు! సంచి బరువుగా తోచింది. వీధి గుమ్మంలో కూర్చున్న ప్రెసిడెంటుగారు పలకరించారు.

"నీ భార్యకి ఉదయం నుంచీ వాంతులూ, విరేచనాలూ! కలరా ఏమో అని అనుమానంగా ఉందన్నారు ఆచార్యులగారు! మరేం భయం లేదని చెప్పారనుకో." విషయం చెప్పి ధైర్యం కూడా చెప్పారు ప్రెసిడెంటుగారు.

వెంకటస్వామికి కాళ్ళు వణక సాగాయి.

ఇంట్లోంచి ఆచార్యులుగారు బయటకు వచ్చారు భయంగా చూశాడు వెంకటస్వామి.

"నీ గౌరికి విరేచనాలు ఎక్కువగా ఉన్నాయ్! పరిస్థితి బావులేదు! వెంటనే పట్నం తీసుకెళ్లి హాస్పిటల్లో జాయిన్ చేయించాలి!" చెప్పాల్సింది చెప్పి చల్లగా జారుకున్నారు ఆచార్యులుగారు.

"గౌరి!" అంటూ కేక వేస్తూ ఇంట్లోకి వెళ్లాడు వెంకటస్వామి.

గౌరి మాట్లాడే పరిస్థితిలో లేదు. భర్తను చూసి కన్నీరు నింపుకుంది. 'నే పోతున్నా!' అన్నట్లు సైగ చేసింది. అతని చేతిలోని సంచి జారి కింద పడింది. గౌరి కోరిన పుల్లారెడ్డి స్వీట్సు మూడు రకాలున్నాయ్ అందులో.

"లేదు. గౌరి! నువ్వు బతుకుతావ్! ఎంత డబ్బైనా ఖర్చు చేసి నిన్ను బతికించుకుంటా!" చిన్నపిల్లాడిలా వలవలా ఏడుస్తూ ఆమె మంచం పక్కనే కుప్పలా కూలిపోయాడు వెంకటస్వామి.

వెనకనే వెళ్ళి అతణ్ణి లేవదీశారు ప్రెసిడెంటుగారు.

"టాక్సీ వస్తుంది! నీ పెళ్ళాన్నీ పెద్దాస్పత్రికి తీసుకుని వెళదాం!

ఆమెకేం భయంలేదు!" ధైర్యం చెప్పారు.

"టాక్సీ కబురు పంపారా?" లేస్తూ అడిగాడు వెంకటస్వామి.

"అఁ మా పెద్దబ్బాయి సురేష్‌బాబు మోటారు సైకిలుమీద వెళ్ళి టాక్సీకి డబ్బిచ్చి వచ్చాడు! ఈ పాటికి వస్తూ ఉంటుంది!" చెప్పారు ప్రెసిడెంటు గారు.

"ఏ టాక్సీ, బాబూ? నంబరు తెలుసా?" కంగారుగా అడిగాడు.

"ఏమో! తెలీదు! సురేష్ బాబుకి తెలుస్తుంది!" పక్క వీధిలో ఉన్న ప్రెసిడెంటుగారింటికి పరుగెత్తాడు వెంకటస్వామి.

ఆ ఇంట్లో లైటు వెలుగుతూంది! పరీక్షలు దగ్గర పడ్డం వల్ల ఇంకా చదువుకుంటున్నాడు సురేష్‌బాబు. దబదబా తలుపులు బాదాడు వెంకటస్వామి.

వెంకటస్వామి చూస్తూనే చెప్పాడు సురేష్! "నీ భార్యకి ఒంట్లో బాగులేదు! పెద్దస్పత్రికి టాక్సీమీద నాన్నగారే స్వయంగా తీసుకెళ్ళారు. మరేమీ భయపడకు!"

"లేదు, బాబు! టాక్సీ ఇంకా రాలేదు!" బావురుమన్నాడు వెంకటస్వామి.

"ఇంకా రాలేదా? నా వెనకనే వస్తానన్నాడు! రెండుగంటలు అయింది!" ఆశ్చర్యపోయాడు సురేష్‌బాబు.

"ఆ డ్రైవరు పేరు తెలుసా, బాబు?" ఆత్రుతగా అడిగాడు.

"ఓబులేసు!"

"ఓబులేసా?" వెంకటస్వామి స్వరం ఒణికింది. అతనిలోని నవనాడులూ కుంగిపోయాయ్.

"ఓబులేసు మంచివాడిలాగే కనిపించాడు! మోసం చేయడు. తప్పకుండా వస్తాడు. ఆయిల్ కొట్టించు కోవడానికి డబ్బు లేదంటే బాడుగ అంతా పూర్తిగా ముందుగానే ఇచ్చేశా! అడిగిన 80 రూపాయలు ఇచ్చేశా, ఏదో అవాంతరం వచ్చి ఆలస్యం అయి ఉంటుంది. తప్పకుండా వస్తాడు. ఈపాటికి వచ్చే ఉంటాడు. మీ ఇంటికి వెళదాం పద." తొందర చేశాడు సురేశ్‌బాబు.

"వాడు రాడు బాబూ!" వాపోయాడు.

"లేదు! తప్పకుండా వస్తాడు! పేషెంటుకి చాలా ప్రమాదంగా ఉందనీ, అర్జంటుగా రమ్మనీ చెప్పాను! ప్రాణం విలువ తెలిసిన వాడు ఎప్పుడూ దగా చేయడు! అయితే ఆ పేషెంటు మీ భార్య అని చెప్పి ఉండాల్సింది! వెంటనే వచ్చేసును. కంగారులో ఆ విషయం చెప్పలేదు! ప్రెసిడెంటు గారింటకి రా! అని మాత్రమే చెప్పాను. తప్పకుండా వస్తాడు!"

"వాడు రాలేదు బాబూ!" మరోసారి బావురు మన్నాడు వెంకటస్వామి.

"ఏం? వాడి కేమైంది? ఏక్సిడెంటైందా?" కీడుని శంకించాడు సురేష్‌బాబు.

జవాబు చెప్పలేక పోయాడు వెంకటస్వామి.

"వాడు తప్పకుండా వస్తాడు. ప్రాణం విలువ తెలిసిన వాడు మరోలా ప్రవర్తించడు! ఇప్పుడు రాకపోతే రేపు వెళ్లి నలుగురి ముందూ కడిగి వదులు తాననే భయంతోనైనా వచ్చి తీరుతాడు.

"వాడు రాడు, బాబూ!" అని మళ్ళీ వెంకటస్వామి అనడంతో అచ్చెరువందాడు సురేష్‌బాబు. ఆ తరువాత అనుమానపడ్డాడు.

"మంచివాడిలాగే కనిపించాడే! అవసరం కూడా చెప్పాను! వస్తానని మాటకూడా ఇచ్చాడు. ఒకవైపు మానవత్వం మందలిస్తూంటే, వేరొక వైపునుంచి నీతి నిజాయితీలు నిందిస్తూంటే ఎంతటి దుర్మార్గుడైనా మాటకి కట్టుబడక మానడు. నైతిక విలువలకి పట్టుబడకమానడు! గజదొంగైనా హంతకుడైనా ఎప్పుడో ఒకప్పుడు ఇచ్చిన మాటకీ కట్టుబడతాడు. అవసరమైతే పట్టుబడతారు కూడా!"

"లేదు, బాబూ! మీకు తెలీదు!"

వెంకటస్వామి మాటలకి విసుగెత్తింది అతనికి "ఏం? వాడు దుష్టుడా? "దుర్మార్గుడా? మోసగాడా"?

జవాబు చెప్పలేదు వెంకటస్వామి.

"అయినా పరవాలేదు! తప్పకుండా వస్తాడు పద! రాకపోతే మరోకసారి వెళ్లి తీసుకుని వస్తా" వెంకటస్వామి చేయిపట్టుకుని నడిచాడు సురేష్‌బాబు.

సురేష్‌బాబు, వెంకటస్వామి ఆ ఇల్లు చేరుకునే సరికి ఇంటిముందు టాక్సీ ఆగి ఉంది. వారి మనసులు కుదుట పడ్డాయి. ఒకరి మోహాలు ఒకరు చూసుకున్నారు.

అప్పటికే గౌరిని టాక్సీలో పడుకోబెట్టారు. దగ్గరగా వెళ్లి చూశాడు వెంకటస్వామి.

ఓబులేసు డ్రైవరు సీట్‌లో కూర్చుని ఉన్నాడు.

"ఓబులేసు!" అప్యాయంగా పిలిచాడు వెంకటస్వామి.

"మీరా, సార్! ఇక్కడికెప్పుడొచ్చారు?" గౌరవ సూచకంగా కారు దిగాడు ఓబులేసు.

"నేనేనయ్యా! ఆ పేషెంటు నా భార్య! మాట నిలబెట్టుకున్నావయ్యా!" అభినందించాడు వెంకటస్వామి.

"మనిషికి అసలు విలువలేదండి! అతని మాటకే విలువ ఉంటుంది.! డబ్బు లేదని మానేస్తే మా మాటకున్న విలువేదండి? రేపు నలుగురి ముందూ ఎలా మోహం ఎత్తుకుని తిరగ్గలను చెప్పండి!"

"నీలో ఆ భగవంతుడు ఉన్నాడయ్యా ఓబులేసు! చేతులు జోడించాడు వెంకటస్వామి.

"అంత మాటనకండి సార్! నావృత్తి ధర్మాన్ని నెరవేర్చుకున్నా!అంతే! మీ వాళ్ళ కేం ప్రమాదం ఉండదు. ఆ శ్రీకృష్ణ భగవానుడే చక్రం అడ్డు వేస్తాడు!

ఎక్కండి సార్ వెళదాం!" తొందర చేశాడు.

కారెక్కి కూర్చున్నాడు వెంకటస్వామి. ఎదురుగా కన్పించిన కృష్ణభగవానుని ఫోటోకి మనసారా నమస్కరించాడు. కారు కదిలింది.

ఆంధ్ర ప్రభ వారపత్రిక
శ్రీ మాదిరెడ్డి సులోచన ప్రథమ వర్ధంతి సందర్భంగా
అభ్యుదయ వేదిక, హైదరాబాద్ వారు నిర్వహించిన పోటీలో
బహుమతి పొందిన కథ
తేది 28-3-1984